# నమస్తే తెలంగాణ
# వికారాబాద్
I | హైదరాబాద్, శనివారం 31 ఆగస్టు 2024 | VIKARABAD



వికారాబాద్ పరిధిలోని సర్పన్‌పల్లి చెరువు

# జీతాలు ఇయ్యండి సారూ..

**ఎన్నిసార్లు వేడుకున్నా కనికరించని కాంగ్రెస్ ప్రభుత్వం**

**లస్కర్ల జీతాలు ఇవ్వకుండా వారి జీవితాలతో చెలగాటం**

వికారాబాద్, ఆగస్టు 30 : ప్రభుత్వ ఉద్యోగులు విధులకు హాజరు కావాలంటే.. రాకపోకలకు అయ్యే ఖర్చుల కోసం నిత్యం అప్పులు చేయాల్సి వస్తున్నది. 6 నెలలుగా జీతాలు ఇవ్వకపోవడంతో వారి జీవితాలు దుర్భరంగా మారాయి. జీతాలు ఇవ్వకపోయినా విధులకు హాజరయ్యామని, ఇరిగేషన్ శాఖలో చెరువుల వద్ద పని చేస్తున్న (లస్కర్లు) ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత సంవత్సరం బీఆర్ఎస్ ప్రభుత్వం వీఆర్ఏ వ్యవస్థను రద్దు చేసి.. వారిని ఆయా శాఖల్లో సర్దుబాటు చేసింది. ఇందులో భాగంగా ఆయా శాఖల్లో ఉన్న వారికి సమయానికి జీతాలు రావడంతో ఎలాంటి ఇబ్బందులు తలెత్తలేదు. ఏడాది కింద విధుల్లో చేరిన వారికి ఆగస్టు, సెప్టెంబర్, అక్టోబర్, నవంబర్, డిసెంబర్, జనవరి నెలలకు సంబంధించిన వేతనాలు రాలేదు. ఆయా శాఖల్లో విధులు నిర్వహిస్తున్న వారికీ జీతాలు వచ్చాయి.. కానీ, మాకు మాత్రం ఎందుకు మా వేతనాలు చెల్లించడం లేదని లస్కర్లు ఆందోళన చెందుతున్నారు. వారు ప్రతి రోజూ ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు చెరువుల వద్ద విధులు నిర్వర్తిస్తున్నారు. చెరువు అంచున కలుపు మొక్కలను తొలగించడం, చెరువు కింద ఉన్న పొలాలకు నీటిని విడుదల చేయడంతో పాటు ప్రభుత్వం ఆదేశించిన పనులను వారు చేస్తుంటారు. జీతాలు రావడం లేదని ఇరిగేషన్ అధికారులకు మొరపెట్టుకున్నా ఎలాంటి ప్రయోజనం లేదని తమ గోడును వినిపించారు. చేసేదేమిలేక కన్నీళ్లు దిగమింగుకుంటూ తప్పని పరిస్థితుల్లో విధులు నిర్వహిస్తున్నామని అంటున్నారు. ఒక్కొక్క లస్కరుకు రూ.80 వేల నుంచి రూ.2 లక్షల వరకు అప్పులు ఉన్నాయి. తమ సమస్యను అర్థం చేసుకుని జీతాలు చెల్లించాలని కోరుతున్నారు.

### అప్పు తెచ్చి బండి ఫైనాన్స్ కడుతున్నా..



కొత్తగా టీవీఎస్ ఎక్స్ఎల్ ద్విచక్ర వాహనాన్ని కొనుగోలు చేశా. ధారూరు మండలం కుమ్మరిపల్లి నుంచి వికారాబాద్ సర్పన్‌పల్లి ప్రాజెక్టు వద్ద విధులు నిర్వహించేందుకు నిత్యం వస్తుంటా. ప్రతి నెలా బండి ఫైనాన్స్ డబ్బులు కట్టాల్సి వస్తున్నది. గత 6 నెలలుగా జీతాలు రాకపోవడంతో కుటుంబ పోషణ కూడా భారంగా మారింది. అప్పులు చేసి బండి కిస్తులు కడుతున్నా. సుమారు రూ.80వేల వరకు అప్పు చేశా. ఇప్పటికైనా కాంగ్రెస్ పభుత్వం పెండింగ్ ఉన్న జీతాలను విడుదల చేసి మమ్మల్ని ఆదుకోవాలి.

– రామచంద్రయ్య, సర్పన్‌పల్లి చెరువు లస్కరు, వికారాబాద్

### చెరువు వద్దే ఉంటున్నాం..



చెరువు పక్కల ఉన్న కలుపు మొక్కలు, గడ్డిని సైతం తొలగిస్తున్నా. చెరువు, అలుగుకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూసుకుంటున్నా. చెరువు నుంచి రైతుల పొలాలకు నీటిని విడుదల చేస్తున్నా. ఆరు నెలలుగా జీతాలు రాకపోవడం బాధగా ఉన్నది. ఊరికి దూరంగా ఉండడం వల్ల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. ఇప్పటి వరకు రూ.1.20లక్షల అప్పు చేశా. జీతాలు సకాలంలో అందిస్తే నా అప్పులు తీర్చుకుంటా. కాంగ్రెస్ ప్రభుత్వం మాపై దయ చూపాలి.

– వెంకటయ్య, ధారూరు


### మా బాధలు పట్టించుకోండి సారూ..



లస్కరు విధుల్లో చేరి దాదాపుగా సంవత్సర కాలం అవుతున్నది. నిత్యం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విధులు నిర్వహిస్తున్నా. సర్పన్‌పల్లి చెరువు కట్టపై కలుపు మొక్కలు తొలగిస్తున్నా. రైతులకు సరిపడా నీటిని క్రమం తప్పకుండా విడుదల చేస్తున్నా. వర్షానికి తడుస్తూ.. ఎండకు ఎండుతూ.. విధులు నిర్వహిస్తున్నా. ఆరు నెలలుగా జీతాలు రాకపోవడంతో దాదాపు రూ.లక్షకు పైగా అప్పు చేసినా. అప్పులు తీసుకొని విధులకు హాజరు కావాల్సిన దుస్థితి ఏర్పడింది. మా బాధలను జర పంట్టించుకోండి సారూ..

– రామచంద్రయ్య, యావపూర్, నవాబుపేట






రంగారెడ్డి జిల్లాలో ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలన ప్రక్రియ ఆశించిన స్థాయిలో కదలిక లేదు. సిబ్బంది కొరతతో కుప్పలు తెప్పలుగా ఉన్న పెండింగ్ దరఖాస్తులను పరిశీలించడం అధికారులకు పరీక్షే అవుతున్నది. మున్సిపాలిటీ, కార్పొరేషన్ల పరిధిలో 2,37,259 దరఖాస్తులు, మండలాల పరిధిలో 63వేలకు పైగా దరఖాస్తులు క్రమబద్ధీకరణ కోసం వచ్చాయి. ఫీజు భారంతోనూ చాలామంది దరఖాస్తుదారులు క్రమబద్ధీకరణకు ముందుకు రావడం లేదు. మూడు నెలల్లో దరఖాస్తుల పరిశీలన ప్రక్రియను పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశించగా.. గడువులోగా పూర్తవ్వడం కష్టమేనని తెలుస్తున్నది.

- రంగారెడ్డి, ఆగస్టు 30 (నమస్తే తెలంగాణ)

# పరిశీలన పరీక్షే!

### ఏళ్ల తరబడిగా పెండింగ్‌లోనే..

రంగారెడ్డి జిల్లా విభజన తర్వాత స్థిరాస్తి వ్యాపారం ఊపందుకున్నది. పట్టణాలు, మండల కేంద్రాలు, గ్రామాల్లో సైతం వెంచర్లు చేసి ప్లాట్లుగా విక్రయించారు. ఇందులో నివాస యోగ్యమైనవే కాకుండా వ్యవసాయ భూములు, ప్రభుత్వ సీలింగ్, చెరువు శిఖం, అసైన్డ్ భూములతోపాటు నాలాలు, గుట్టలు, గట్లను కూడా ప్లాట్లుగా మార్చేశారు. వీటికి గత ప్రభుత్వం ఇండ్ల నిర్మాణాలకు అనుమతులు నిరాకరించి క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకోవాలని సూచించింది. దీంతో పెద్ద ఎత్తున దరఖాస్తులు వచ్చాయి. పెండింగ్‌లో ఉన్న ఈ దరఖాస్తులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇటీవల గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. వివిధ కారణాలతో దరఖాస్తుల పరిశీలన ప్రక్రియ ముందుకు సాగడం లేదు. మున్సిపాలిటీల పరిధిలో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుల్లో 35,837 దరఖాస్తులు నిషేధిత జాబితాలో ఉన్నాయి. 3,458 దరఖాస్తులకు మాత్రమే ఇప్పటి వరకు ఆమోదం తెలిపారు. వీటిలో 1,110 దరఖాస్తులకు మాత్రమే ఫీజు చెల్లించి దరఖాస్తుదారులు క్రమబద్ధీకరించుకున్నారు. ఇంకా 2,348 మంది క్రమబద్ధీకరణ రుసుమును చెల్లించలేదు. 1,96,154 దరఖాస్తులు అధికారుల వద్ద పెండింగ్‌లో ఉన్నాయి.

### సవాల్‌గా మారిన దరఖాస్తుల పరిశీలన ..



జిల్లా వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలనకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల పరిధిలో 45 బృందాలను, గ్రామ పంచాయతీల పరిధిలో 18 బృందాలను ఏర్పాటు చేశారు. మున్సిపాలిటీల్లో మున్సిపల్ కమిషనర్, రెవెన్యూ, నీటి పారుదల, వార్డు అధికారులనూ బృందాల్లో భాగస్వామ్యులను చేశారు. పంచాయతీల్లో కార్యదర్శి, రెవెన్యూ, నీటి పారుదల శాఖల అధికారులతో బృందాలను ఏర్పాటు చేశారు. ఎల్ఆర్ఎస్‌కు దరఖాస్తు చేసుకున్న వాటిలో అనధికార లే అవుట్లు మున్సిపాలిటీల్లో 671 ఉండగా, పంచాయతీల్లోనే అత్యధికంగా 1,001 వరకు ఉన్నాయి. ఆయా శాఖల అధికారులు లే అవుట్లను పరిశీలించి కోర్టు కేసులు, ప్రభుత్వ, అసైన్డ్ భూములు, ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ తదితర వాటిని క్షుణ్ణంగా పరిశీలించాల్సి ఉన్నది. మార్గదర్శకాలకు లోబడి ప్లాట్లు ఉంటే కొలతలు, డాక్యుమెంట్ రిజిస్ట్రేషన్ తేదీ, ఆ సమయంలో మార్కెట్ ధరల వంటి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాల్సి ఉంటుంది. ఇందుకు ఒక్కో దరఖాస్తుకు గంట నుంచి రెండు గంటల సమయం పడుతున్నదని అధికారులు చెబుతున్నారు. వివిధ శాఖల అధికారులు వారివారి శాఖల పనులతోనే సతమతమవుతుండగా ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను పరిశీలించేందుకు సమయం దొరకడం లేదు. ఈ కారణంగానూ దరఖాస్తుల పరిశీలన ప్రక్రియ ఆశించిన స్థాయిలో ముందుకు సాగడం లేదు.

### అప్పట్లో వ్యతిరేకించి..

గత ప్రభుత్వ హయాంలో ప్లాట్ల క్రమబద్ధీకరణకు రూ.1,000 చలాన్ కట్టి తీసుకుని దరఖాస్తు చేసుకున్నారు. ఈ రుసుమును వసూలు చేయడంపై అప్పట్లో ప్రతిపక్షంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా వ్యతిరేకించింది. ఎల్ఆర్ఎస్‌కు రుసుమును రద్దు చేయాలని డిమాండ్ చేసిన నాటి కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు అధికారంలోకి వచ్చిన తర్వాత పెద్ద ఎత్తున ఫీజులు వసూలు చేస్తుండడంపై ప్రజల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం రూ.లక్షల్లో ఫీజులు చెల్లించాల్సి వస్తుండడం.. కొనుగోలు చేసిన ప్లాట్ ధరతో ఎల్ఆర్ఎస్ ఫీజు సమానంగా ఉంటుండడంతో చాలామంది దరఖాస్తుదారులు అంతగా ఆసక్తి చూపడం లేదు. ఇప్పటికే ఇండ్లు కట్టుకున్న వారు సైతం ముందుకు రావడం లేదు.



**మున్సిపాలిటీలు/కార్పొరేషన్లలో దరఖాస్తులు ఇలా..**

| మున్సిపాలిటీ | దరఖాస్తులు |
|---|---|
| ఆదిబట్ల | 14,892 |
| ఆమనగల్లు | 3,561 |
| ఇబ్రహీంపట్నం | 15,345 |
| జల్‌పల్లి | 10,892 |
| కొత్తూరు | 3,956 |
| మణికొండ | 2,591 |
| నార్సింగి | 3,354 |
| పెద్ద అంబర్‌పేట | 43,459 |
| షాద్‌నగర్ | 15,466 |
| శంషాబాద్ | 6,791 |
| శంకర్‌పల్లి | 4,720 |
| తుక్కుగూడ | 2,541 |
| తుర్కయాంజాల్ | 49,686 |
| బడంగ్‌పేట | 47,790 |
| బండ్లగూడజాగీర్ | 7,753 |
| మీర్‌పేట | 3,412 |

**మండలాల్లో దరఖాస్తులు ఇలా**

| మండలం | దరఖాస్తులు |
|---|---|
| ఫరూఖ్ నగర్ | 22,051 |
| కేశంపేట | 10,200 |
| తలకొండపల్లి | 2,323 |
| యాచారం | 4,464 |
| కడ్తాల్ | 3,513 |
| కొందుర్గు | 1,505 |
| ఆమనగల్లు | 929 |
| మాడ్గుల | 708 |
| చౌదరిగూడెం | 683 |
| మంచాల | 54 |

## శివ సాగర్ ప్రాజెక్టులోకి మురుగునీరు రాకుండా చర్యలు తీసుకోండి

**ఇరిగేషన్ అధికారులను ఆదేశించిన వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్**

వికారాబాద్, ఆగస్టు 30 : వికారాబాద్ పట్టణంలోని శివసాగర్ ప్రాజెక్టులోకి మురుగు నీరు రాకుండా తగు చర్యలు తీసుకోవాలని వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్ ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం వికారాబాద్ మున్సిపల్ పరిధిలోని శివసాగర్ ప్రాజెక్ట్ అనుసంధాన కాల్వను, మార్కెట్ యార్డులో నిర్మిస్తున్న సమీకృత మార్కెట్ దుకాణాల సముదాయాన్ని మున్సిపల్ చైర్ పర్సన్ మంజులరమేశ్, కమిషనర్ జాకీర్ అహ్మద్, సంబంధిత అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులతో కలెక్టర్ మాట్లాడారు. వికారాబాద్ మున్సిపాలిటీలోని ప్రజలకు తాగు నీరు అందించే శివసాగర్ ప్రాజెక్టులోకి మురుగు నీరు చేరి కలుషితమవుతున్నదని, అలా జరుగకుండా తగు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. భావితరాలకు ఎంతగానో ఉపయోగపడే శివసాగర్ ప్రాజెక్టును కాపాడుకోవాల్సిన బాధ్యత ఎంతైనా ఉన్నదని అన్నారు. పూడూరు మండల పరిధిలోని కొన్ని ప్రాంతాల్లోని గ్రామాల నుంచి వచ్చే మురుగు నీరు ప్రాజెక్టులోకి రావడం వల్ల జరిగే ప్రమాదాన్ని గుర్తించిన కలెక్టర్ మురుగు నీటిని కాల్వల ద్వారా మళ్లించేందుకు చేపట్టాల్సిన పనుల ప్రతిపాదనలను సమర్పించాలని నీటిపారుదల శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సుందర్‌ను కలెక్టర్ ప్రతీక్ జైన్ ఆదేశించారు. ప్రాజెక్టులో పేరుకుపోయిన ప్లాస్టిక్, చెత్తాచెదారాన్ని తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని కమిషనర్‌కు సూచించారు. మార్కెట్ యార్డులో నిర్మిస్తున్న సమీకృత మార్కెట్‌ను సందర్శించిన కలెక్టర్ సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేసి చిరు వ్యాపారులకు అందుబాటులోకి తీసుకురావాలని పేర్కొన్నారు. కలెక్టర్ వెంట మున్సిపల్ అధికారులు, ఇరిగేషన్ అధికారులు, సిబ్బంది ఉన్నారు.


శివసాగర్ చెరువు వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ ప్రతీక్ జైన్


నందిగామ పృథ్వీ కాలనీలో షాపులను తనిఖీలు చేస్తున్న శంషాబాద్ ఏసీపీ శ్రీనివాస్, సీఐలు ప్రసాద్, నర్సింహారావు

## మాదక ద్రవ్యాలు అమ్మితే కఠిన చర్యలు

నందిగామ, ఆగస్టు 30 : మాదకద్రవ్యాలు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని శంషాబాద్ ఏసీపీ కే శ్రీనివాస్ హెచ్చరించారు. శుక్రవారం నందిగామ మండలం అయ్యప్ప టెంపుల్ పృథ్వీ కాలనీలో శంషాబాద్ ఏసీపీ శ్రీనివాస్‌రావు, నందిగామ సీఐ పీ ప్రసాద్, కొత్తూరు సీఐ నర్సింహారావు, ఎస్ఐలు గోపాల కృష్ణ, తిరుపతిరావు, ఆరుగురు ఏఎస్ఐలు, 50 మంది సిబ్బందితో కలిసి కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. కిరాణ షాపులు, ఇండ్లల్లో తనిఖీలు నిర్వహించారు. ఇందులో భాగంగా దొరికిన మద్యం, నిషేధిత గుట్కా ప్యాకెట్లు, గ్యాస్ సిలిండర్లను సీజ్ చేసి పలువురిపై కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఏసీపీ శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ గంజాయి, మద్యం, గుట్కా, వంటి మత్తు పదార్థాలను అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. యువత మత్తు పదార్థాలకు బానిసలు మారి తమ బంగారు భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారని తెలిపారు. పారిశ్రామిక ప్రాంతం కావడంతో ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన వలస కార్మికులు అధికంగా వస్తున్నారన్నారు. ఇండ్లు అద్దెకు ఇచ్చే యజమానులు తప్పకుండా ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే వారి ఆధార్ కార్డు, తదితర వివరాలను తెలుసుకున్న తర్వాతే ఇల్లు అద్దెకు ఇవ్వాలని సూచించారు. ఎలాంటి వివరాలను తెలుసుకోకుండా అద్దెకు ఇవ్వవద్దని, నేరాలు జరిగితే ఇబ్బందులు పడుతారని ఇండ్ల యజమానులకు సూచించారు.

## ప్రభుత్వ పాఠశాలలను రోల్ మోడల్‌గా తీర్చిదిద్దాలి

**రంగారెడ్డి కలెక్టర్ శశాంక**

రంగారెడ్డి, ఆగస్టు 30 (నమస్తే తెలంగాణ) : ప్రభుత్వ పాఠశాలలను రోల్ మోడల్‌గా తీర్చిదిద్దాలని రంగారెడ్డి కలెక్టర్ శశాంక అన్నారు. శుక్రవారం రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ మండలంలోని రాజేంద్రనగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలోని వసతులు, ఉపాధ్యాయుల బోధన విధానం, భోజన వసతులు, పిల్లల ఎదుగుదలకు కావాల్సిన పోషక ఆహారం తదితర వివరాలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజన వసతులను పరిశీలించారు. మరుగుదొడ్లు, తాగు నీరు, సైన్స్ ల్యాబ్, కంప్యూటర్ ల్యాబ్, లైబ్రరీ తదితర సదుపాయాల కల్పన విషయాలను ప్రిన్సిపాల్‌ను అడిగి తెలుసుకున్నారు. 2023–24 విద్యా సంవత్సరంలో పదో తరగతిలో 70 శాతం ఉత్తీర్ణత నమోదు కాగా.. ఈ ఏడాది వందకు వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా విద్యార్థులను తీర్చిదిద్దాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థులు కొత్త ఆవిష్కరణలు రూపొందించేలా.. శాస్త్రీయ ఆలోచన పెంపొందించుకునేలా తయారు చేయాలన్నారు. అండర్ వెయిట్‌లో ఉన్న విద్యార్థులను గుర్తించి వారి ఎదుగుదలకు అవసరమైన పౌష్టిక ఆహారం, మెడికల్ సదుపాయాలను అందించే విధంగా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. మెడికల్ క్యాంప్‌లు నిర్వహించి సీజనల్ వ్యాధులు సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించాలన్నారు. పాఠశాలను రోల్ మాడల్‌గా తీర్చిదిద్దేందుకు పాఠశాలలో భోజన శాల, కంప్యూటర్ ల్యాబ్, సైన్స్ ల్యాబ్, లైబ్రరీ, ప్లే గ్రౌండ్‌లు ఏర్పాటు చేసుకోవడానికి కావాల్సిన వసతులకు ఆర్థికంగా సాయం చేయడానికి ముందుంటామని పేర్కొన్నారు. ఇందుకు సంబంధించిన రిపోర్టును తయారు చేసి డీఈవోకు అందజేయాలని ప్రిన్సిపాల్‌ను ఆదేశించారు. కలెక్టర్ వెంట జిల్లా విద్యాశాఖాధికారి సుశీందర్ రావు, ఎంఈవో శంకర్ తదితరులు ఉన్నారు.

### కస్తూర్బా గాంధీ పాఠశాల సందర్శన..

గండిపేట మండలం కిస్మత్‌పూర్ కస్తూర్బా గాంధీ బాలిక విద్యాయాన్ని కలెక్టర్ శశాంక సందర్శించి, విద్యార్థినులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. విద్యార్థినులకు అందిస్తున్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థినుల ఉత్తీర్ణత శాతం మెరుగుపడే విధంగా, చదువులో వెనుకబడిన వారిని గుర్తించి ప్రత్యేక శ్రద్ధ తీసుకుని కచ్చితంగా ఉత్తీర్ణులయ్యేలా చర్యలు చేపట్టాలన్నారు.


రాజేంద్రనగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను తనిఖీ చేసిన అనంతరం విద్యార్థులతో మాట్లాడుతున్న రంగారెడ్డి కలెక్టర్ శశాంక